

ఎసిఎఫ్ఐ జిల్లా కార్యదర్శిగా 'గొండు'

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

ఎసిఎఫ్ఐ (అవినీతి నిరోధక ఫౌండేషన్ ఇండియా) జిల్లా కార్యదర్శిగా ఆమదాలవలస నియోజకవర్గ సామాజిక సేవా ప్రతినిధి గొండు రమణమూర్తి నియమితులయ్యారు. విశాఖపట్నం కార్యాలయంలో మంగళవారం నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎసిఎఫ్ఐ రాష్ట్ర ప్రెసిడెంట్ షేక్ రాజిక్, వైస్ ప్రెసిడెంట్ కోసూరి శ్రీనివాసరావు, కన్వీనర్ సురేష్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నానని తెలిపారు. అవినీతికి వ్యతిరేకంగా పనిచేస్తానని ఈ సందర్భంగా వెల్లడించారు.



నియామకపత్రం అందుకుంటున్న రమణమూర్తి

ఇదేనా సామాజిక న్యాయం?

- ఎస్సి, ఎస్టిలకు సీటు ఇవ్వని ప్రధాన పార్టీలు
- సామాజిక యాత్ర పేరుతో వైసిపి
- దళిత తేజం పేరుతో టిడిపి ప్రచారం

జిల్లాల విభజన తర్వాత తొలిసారి జరుగుతున్న ఎన్నికలల్లో జిల్లా నుంచి అసెంబ్లీలో ఎస్సి, ఎస్టిల గొంతుకు వినిపించే పరిస్థితి లేకుండాపోయింది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో పాలకొండ ఎస్టిలకు, రాజాంను ఎస్సిలకు రిజర్వు చేశారు. వాటిలో పాలకొండ పార్వతీపురం మన్యం జిల్లాలోకి వెళ్లిపోగా, రాజాం విజయనగరం జిల్లాలో చేరింది. దీంతో జిల్లాలో రిజర్వుడ్ స్థానాలు గల్లంతయ్యాయి. వాటికి బదులుగా జిల్లాలో ఆయా తరగతులకు ఒక్కచోట కూడా ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపి కేటాయించకపోవడం వారి పట్ల ఎంత ప్రేమ ఉందో అర్థమవుతోంది. టికెట్ల కేటాయింపు సందర్భంగా యువత, మహిళ, బిసి కేటగిరీలకు పెద్ద పీట వేశామని చెప్పిన ఆయా పార్టీల అధినేతలు అణగారిన వర్గాలను విస్మరించాయి.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాల పునర్వ్యస్థీకరణ తర్వాత జిల్లాలో 2011 జనాభా లెక్కల ప్రకారం 21.91 లక్షల జనాభా ఉంది. అందులో ఎస్సిల జనాభా 1.85 లక్షలు కాగా, ఎస్టిల జనాభా 94 వేల మంది ఉన్నారు. ప్రస్తుతం జిల్లా జనాభా 29 లక్షలు ఉంటుందని ఒక అంచనాగా ఉంది. దీంతో ఎస్సి, ఎస్టిల జనాభా కూడా అదే నిష్పత్తిలో పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ రెండు సామాజిక తరగతులు ప్రత్యేకించి ఎస్టిలు జిల్లాలో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. జిల్లాలో పాతపట్నం నియోజకవర్గంలో అత్యధికంగా 39,633 మంది జనాభా ఉంది. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 16,498 మంది, పలాసలో 15,902 మంది జనాభా ఉంది. టెక్కలిలో 9 వేలు మంది, నరసన్నపేటలో 8 వేలు మంది ఉన్నారు. మిగిలిన ఇతర ప్రాంతాల్లోనూ అడపదడపా గిరిజనులు నివసిస్తున్నారు. జిల్లాల విభజన తర్వాత ఐటిడిఎ లేని జిల్లాగా శ్రీకాకుళం మిగిలింది. దీంతో పాటు షెడ్యూల్ గ్రామాల సమస్య, జిల్లాకు సంబంధించి ఇతర సామాజిక తరగతులను ఎస్టిలోకి చేర్పించే ప్రయత్నాలు అంశాలు తీవ్ర సమస్యలుగానే ఉన్నాయి. దీంతో పాటు జిల్లాలో తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి వెయ్యి మందిపైగా గిరిజనేతరులు ఉద్యోగాల్లో ఉన్నట్లు గిరిజనులు గుర్తించారు. వీటిపై గిరిజనులు వివిధ రూపాల్లో సాగిస్తున్న ఆందోళనలు అరణ్య రోదనగానే మిగిలిపోయింది. అసెంబ్లీలో పోరాడితే తప్ప ఈ సమస్యలు పరిష్కారం కావని వారు భావిస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు మాత్రం ప్రధాన పార్టీలు ఈ సామాజిక తరగతికి టికెట్ కేటాయించకపోవడంతో వారంతా గుర్రుగా ఉన్నారు.



ఇచ్ఛాపురంలో సామాజిక సాధికార యాత్రలో పాల్గొన్న వైసిపి నాయకులు (ఫైల్)

ఎస్సిలకూ దక్కని టిక్కెట్లు

ప్రధాన రాజకీయ పార్టీలు ఎస్సిలకూ సీట్లు కేటాయించకపోవడంతో జిల్లా నుంచి వారి ప్రాతినిధ్యం లేకుండాపోయింది. జిల్లాలో ఎచ్చెర్లలో నియోజకవర్గంలో అత్యధికంగా 34,153 మంది జనాభా ఉంది. పాతపట్నం నియోజకవర్గంలో 32,702 మంది, టెక్కలిలో 26,935 మంది శ్రీకాకుళంలో 23,048 మంది జనాభా ఉంది. దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ పది వేల మంది పైనే ఎస్సిల జనాభా ఉంది. జిల్లాకు సంబంధించి సబ్ప్లాన్ నిధుల వినియోగం, బ్యాక్లాగ్ పోస్టుల భర్తీ తదితర సమస్యలను వీరు ఎదుర్కొంటున్నారు. స్థానిక సంస్థల్లో వీరికి ప్రాతినిధ్యం ఉన్నా చట్ట సభలకు మాత్రం ఏ పార్టీ వీరికి టిక్కెట్ కేటాయించలేదు.

వారిపై ఉత్తుత్తి ప్రేమేనా?

యువత, మహిళ, బిసిలకు పెద్దపీట వేశామని చెప్తున్న ప్రధాన పార్టీలు వారిలో అణగారిన తరగతులను మినహాయిండంపై ఆయా తరగతుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. సామాజిక న్యాయం పేరుతో యాత్రలు చేపట్టిన వైసిపి చివరకు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అణగారిన తరగతులకే టిక్కెట్లు కేటాయించని పరిస్థితి నెలకొంది. దళిత తేజం పేరుతో దళితులకు ఏం చేయబోతున్నామో ప్రచారం చేసుకున్న టిడిపి ఆ తరగతులకు మాత్రం జిల్లాలో ఎక్కడా ఒక సీటును కేటాయించడానికి సిద్ధపడ లేదు. ఎస్సి, ఎస్టిలపై ప్రధాన రాజకీయ పార్టీల కున్నది ఉత్తుత్తి ప్రేమేనని తేటతెల్లమవుతోంది.

ఇండిపెండెంట్లుగా గిరిజనులు

ప్రధాన రాజకీయ పార్టీలైన వైసిపి, టిడిపి తమ సామాజిక తరగతికి టిక్కెట్లు కేటాయించకపోవడంపై గిరిజనులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. రాబోవు ఎన్నికల్లో ఇండిపెండెంట్లుగా బరిలో దిగాలని నిర్ణయించారు. ఈ సారి పలాస, టెక్కలి, పాతపట్నంతో పాటు శ్రీకాకుళం ఎంపీ స్థానానికి పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు.

ప్రచారాలకు అనుమతులు తప్పనిసరి

జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్న వివిధ రాజకీయ పార్టీల ప్రచారాలకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ వెల్లడించారు. జిల్లాలోని రిటర్నింగ్ అధికారులు, ఎంసిసి అధికారులు, నోడల్ అధికారులు, కంట్రోల్ రూమ్ అధికారులతో నిర్వహించిన మంగళవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఎన్నికల ప్రచారాలు చేపడితే ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని తెలిపారు. నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్న సమావేశాలకు, లౌడ్స్పీకర్లకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. తాత్కాలికంగా పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసినా, ప్రచారాలకు వినియోగించే వాహనాలకు, వీధుల్లో నిర్వహించే సమావేశాల లౌడ్స్పీకర్లు, సభా వేదిక, బారికేడ్లు ఏర్పాటు చేసినా, అంతర్జిల్లాలలో తిరిగే వాహనాలు, ఇంటింటా ప్రచారానికి, ర్యాలీలకు అనుమతులు తీసుకోవాలని చెప్పారు. అభ్యర్థులు ఒక వాహనానికి నియోజకవర్గంలో తిరగడానికి తీసుకున్న అనుమతి ఆ నియోజకవర్గంలో తిరగడానికి మాత్రమే వినియోగించాలన్నారు. లౌడ్స్పీకర్లతో ఉన్న వాహనాలకు, పాంప్లేట్స్ (కరపత్రాలు) పంపిణీకి, బేనర్లు, పార్టీ జెండాలు పెట్టేందుకు, పోస్టర్లు, హోర్డింగ్లు ఏర్పాటు చేయాలన్నా అనుమతులు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. ఆన్లైన్లో అనుమతులు కావాలంటే 48 గంటలు ముందు ఎన్నికల సంఘం వారి సువిధలో యాప్లో, ఆఫ్ లైన్లో సంబంధిత రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసి 24 గంటల్లో అనుమతి పొందవచ్చన్నారు. ఆయా రాజకీయ పార్టీలు గమనించి పార్టీకి సంబంధించిన ఏ కార్యక్రమానికైనా అనుమతులు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. టెలీ కాన్ఫరెన్స్లో ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

ఎన్నికల ప్రచారంలో ఉపాధ్యాయుడు



ప్రచారంలో పాల్గొన్న ఉపాధ్యాయుడు (వృత్తంలో ఉన్న వ్యక్తి)

ప్రజాశక్తి- పలాస

ఎన్నికల కోడ్ పూర్తిస్థాయి అమలవుతున్న తరుణంలో ఓ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు వైసిపి సమావేశంలో పాల్గొనడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సాక్ష్యాత్తు దీనికి సంబంధించిన ఫొటోలను వైసిపి నాయకులే మీడియాకు విడుదల చేశారు. 20వ వార్డులోని వైసిపి నాయకులు మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. శివాజినగర్ మదర్ థెరిసా విద్యాలయం వెనుకవీధిలో అక్కడి పెద్దలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వార్డు పెద్ద బొంగు ప్రసాద్ ఇంటి వద్ద కూర్చొని సమస్యల అవగాహన కోసం మాట్లాడారు. అనంతరం ప్లకార్డులు పట్టుకొని వైసిపి అభ్యర్థిని గెలిపిస్తామని వారితో చెప్పించారు. ఆ సందర్భంగా పలాస మండలం పెదంచల పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న మాధవ బెహరా కూడా అందులో పాల్గొన్నారు. అనంతరం ఆ వార్డు పెద్దలు కూడా తమకు మద్దతు తెలిపారు. ఇదిగో అంటు సంబంధిత చిత్రాలు వైసిపి నాయకులు విడుదల చేశారు. దీనిపై ఉపాధ్యాయుడుని గుర్తుపట్టిన స్థానికులు కొంతమంది ఎన్నికల అధికారులకు చిత్రాలు పంపించడంతో ఈ విషయం వెలుగు చూసింది.

ఎస్ఎఫ్ఐ నాయకుల విజయోత్సవాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జెఎన్యులో స్టూడెంట్ యూనియన్ ఎన్నికల్లో లెఫ్ట్ ప్యానెల్ విజయం సాధించడంపై ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.చందు, బి.హరీష్ హర్షం వ్యక్తం చేశారు. నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వద్ద విజయోత్సవ సంబరాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి సాగిస్తున్న దుర్మార్గ విధానాలను ప్రజలు ఈ సార్వత్రిక ఎన్నికల్లో తిప్పికొడతారన్నారు. దీనికి జెఎన్యు ఎన్నికలు ప్రత్యక్ష ఉదాహరణ అన్నారు. యూనివర్సిటీలో హింసకాండకు పాల్పడుతున్న ఎబివిపి మతోన్మాద గుండాలపై ఎస్ఎఫ్ఐ నాయకత్వంలోని లెఫ్ట్ కూటమి ఎన్నో అడ్డంకులను ఛేదిస్తూ విజయం సాధించడం ప్రజాస్వామ్య పరిరక్షణకు నిలువటద్దమన్నారు. ఈ సందర్భంగా బాణసంచా కాలుస్తూ రంగులను చల్లుకుంటూ విజయోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు భూపతి, నగర కమిటీ సభ్యులు పవిత్ర మోహినిరాణి, గోవర్ధన్, కిరణ్ పాల్గొన్నారు.



విజయోత్సవంలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నీటిఎద్దడి నివారణకు చర్యలు

- వడదెబ్బ తగలకుండా ముందస్తు జాగ్రత్తలు అవసరం
- కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్


వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టాలని, ఎండల్లో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుని వడ దెబ్బకు గురి కాకుండా ఆరోగ్య సంరక్షణపై దృష్టి సారించాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లోని వేసవి తాగునీటి ఎద్దడి నివారణా చర్యలపై జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్తో కలిసి మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాగునీటి కొరత ఉన్న ప్రాంతాలను గుర్తించి సక్రమంగా నీరందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. రానున్న రెండు నెలలు అత్యంత కీలకమని, అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని అన్నారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న సమయాల్లో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండుటెండలో బయట సంచరించడం, సరైన రీతిలో తాగునీరు తాగకపోవడం, ఆహారపు అలవాట్లు మార్చుకోకపోవడం వల్ల వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల ఈ మూడు ప్రధాన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మండల స్థాయిలో ఎంపిడిఒల ఆధ్వర్యాన వేసవి ఎద్దడి నివారణా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే గ్రామీణ నీటి సరఫరా విభాగం గ్రామాల్లో నీటి లభ్యత, వనరులను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా బోర్ వెల్స్, రక్షిత నీటి పథకాల నిర్వహణకు అవసరమైన విడి భాగాలను మండలస్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. మరమ్మతులకు గురైన బోర్లు తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలన్నారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల పరిధిలోని నీటి నిల్వలు, లభ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిటీల్లో ఇంజినీరింగ్ అధికారులు క్రమం తప్పకుండా తాగునీటి అవసరాలపై పర్యవేక్షించాలన్నారు. అవసరమైన చోట అధికారులు హాజరై నీటి కొరత లేకుండా సహాయక చర్యలు చేపట్టాలన్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో మున్సిపాలిటీల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఇ శ్రీనివాసరావు జిల్లాలో బోరువెల్స్, పంపులు, రిజర్వాయర్లలో నీటి నిల్వలపై వివరించారు. ప్రధానంగా ఉద్దాన గ్రామాల్లో రక్షిత నీటి పథకం సజావుగా పనిచేయడం ద్వారా నీరందించేందుకు దోహదపడుతుందని అన్నారు. ఎక్కడెక్కడ పర్యవేక్షణ ఉండేలా తగిన జాగ్రత్తలు చేపడుతున్నట్టు వివరించారు. మండలాల వారీగా నీటి నిల్వలను గుర్తించి రక్షిత నీటి పథకాలకు నీరందిస్తున్నామన్నారు. సమస్యాత్మక గ్రామాలను గుర్తించి సహాయక చర్యలు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి నిషాకుమారి, సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జెడ్పి డిప్యూటీ సిఇఒ వెంకట్రామన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, వంశధార ఎస్ఇ డోల తిరుమలరావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, ఐసిడిఎస్ పీడీ శాంతిశ్రీ, డిఆర్డిఎ ప్రాజెక్టు అధికారి కిరణ్కుమార్, ఇరిగేషన్ ఎస్ఇ సుధాకర్, డ్వామా పీడీ చిట్టిరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

పోలీస్స్టేషన్లో వ్యక్తి వీరంగం

- అద్దాలు పగలగొట్టిన వైనం
- స్టేషన్ అంతా రక్తం మరకలు



పగిలిన పోలీస్స్టేషన్ అద్దాలు

ప్రజాశక్తి- పలాస

ఒక వ్యక్తి తప్ప తాగి పోలీస్స్టేషన్లో మంగళవారం వీరంగం సృష్టించాడు. స్టేషన్ అద్దాలు పగలగొట్టి పోలీసులను పరుగెత్తించాడు. స్టేషన్ అంతా రక్తంతో తడిచిపోయింది. వివరాల్లోకి వెళ్తే... కాశీబుగ్గ డెంకివీధికి చెందిన జంగం మణికంఠ కెటి రోడ్డులో ఉన్న బారులో పూటుగా తాగి అక్కడ వీరంగం సృష్టించాడు. అక్కడ దెబ్బలు తగలడంతో తనకు న్యాయం చేయాలని కోరుతూ పోలీస్స్టేషన్ వెళ్లాడు. ఆయన పరిస్థితిని గుర్తించి మెల్లగా అదుపు చేయడానికి పోలీసులు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ఈ మందుబాబు ఉన్మాదిగా మారిపోయాడు. చేతికి దొరికిన వస్తువులతో అందరినీ హడలెత్తించాడు. అద్దాలు పగలగొట్టి పోలీసులపై దాడికి యత్నించారు. ఆయన చేతిపై తీవ్ర గాయమై రక్తమోడుతున్నా వాటితోనే పోలీస్స్టేషన్లో తిరగడంతో సిబ్బంది అంతా భయంతో పరుగులు తీశారు. అనంతరం అతికష్టం మీద ఆయనను పట్టుకుని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ముందుగా బారులో తనపై దాడి చేశారని, న్యాయం చేయాలంటూ పోలీస్ స్టేషన్ వచ్చి వీరంగం సృష్టించడంతో ఏమి చేయాలో తెలియక ఒక్కసారిగా పోలీసులు అవాక్కయ్యారు. ఇదిలా ఉండగా ఆయన తండ్రి కూడా ఆస్పత్రికి చేరుకొని పోలీసులే తన కుమారుడిని కొట్టారని ఆరోపిస్తూ... వారిపై కేకలు వేయడంతో పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు. సంఘటన స్థలానికి ఎస్ఐ వెంకటరావు, సిబ్బంది చేరుకొని ఆయనకు వైద్య సహాయం అందించారు.

రేపు జాబ్మేళా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో నోడల్ రిసోర్స్ సెంటర్, జెకెసి, డిపార్ట్మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ సంయుక్తంగా ఈ నెల 28న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాలో హెటెరో ప్రయివేట్ లిమిటెడ్ ఫార్మాసిటికల్ కంపెనీలో ట్రైనీ కెమిస్ట్ (ప్రొడక్షన్, క్యూసి, క్యూఎ) ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

ప్రొడక్షన్ ఉద్యోగాలకు డిగ్రీ కెమిస్ట్రీ పురుష అభ్యర్థులను, క్యూసి, క్యూఎ ఉద్యోగాలకు ఎంఎస్సి (ఆర్గానిక్, ఇన్ ఆర్గానిక్, అనలేటికల్ కెమిస్ట్రీ), బి ఫార్మసీ ఉత్తీర్ణులైన పురుష, స్త్రీ అభ్యర్థులు హాజరు కావచ్చన్నారు. 27 ఏళ్ల వయసు గల వారు ఈ జాబ్మేళాలో పాల్గొనాలని సూచించారు. ఎంపికైన ఉద్యోగార్థులకు ఇఎస్ఐ, ఇపిఎఫ్, మెడి క్లెయిమ్స్, రిటెన్షన్ బోనస్, సబ్సిడైజ్డ్ ఫుడ్, వసతి, రవాణా సౌకర్యాలతో కలిపి రూ.23 వేలు వేతనం చెల్లిస్తారని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఉదయం 9.30 గంటలకు హాజరు కావాలన్నారు. అభ్యర్థులు అర్హత ధ్రువపత్రాల జిరాక్స్లతో హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాలకు జెకెసి కో-ఆర్డినేటర్, వై.మణికుమార్ ఫోన్ నంబరు 94413 87184కు గాని, కెమిస్ట్రీ విభాగం ఇన్ఛార్జి డి.ఆదినారాయణ 9949094968, 8143277610లకు సంప్రదించాలని సూచించారు.

మరికొద్ది రోజులు చూద్దాం

మాజీ మంత్రి అప్పల సూర్య నారాయణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మూడు రోజులుగా శ్రీకాకుళం నియోజకవర్గం టిడిపిలో కలకలం రేపిన టిక్కెట్టు వివాదాన్ని పరిష్కరించడానికి చంద్రబాబు దూతగా జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ గుండ దంపతులను సోమవారం రాత్రి కలిశారు. నియోజకవర్గ ఇన్ఛార్జి బాధ్యతల్లో ఉన్న గుండ లక్ష్మీదేవిని కాదని టిక్కెట్ అసమ్మతి నాయకుడు గొండు శంకర్కు కేటాయించడాన్ని తప్పుపడుతూ గుండ దంపతులు అభ్యంతరం తెలిపారు. యువతకు ప్రాధాన్యత ఇవ్వాలన్న ఆలోచన ఉన్న అధిష్టానం అసమ్మతి వాదులను అందలమెక్కిస్తారా? అని వారు ప్రశ్నించారు. నియోజకవర్గంలో అభ్యర్థిని తప్పక మార్చాలని వారు జిల్లా అధ్యక్షులకు తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. అలాగే మంగళవారం తమ భవిష్యత్ కార్యాచరణ ప్రకటనను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు గుండ అప్పలసూర్యనారాయణ ప్రకటించారు. నాలుగు దశాబ్దాలుగా టిక్కెట్ కేటాయించిన ప్రతిసారి అసమ్మతిని రాజేస్తున్నారని, క్రమశిక్షణ గల నాయకులకు పార్టీలో ఇస్తున్న గుర్తింపు ఏమిటని ప్రశ్నించిన తర్వాత సమస్యను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లతానని అన్నారు. పార్టీకి నష్టం చేకూర్చే రీతిలో నిర్ణయాలు తీసుకోవద్దని నచ్చజెప్పినట్టు తెలిపారు. కార్యకర్తల మనోభావాలకు అనుగుణంగా తమ నిర్ణయం ఉంటుందని రవికుమార్కు వివరించారు.



అప్పలసూర్యనారాయణ

'టెక్నివర్స్' వెబ్సైట్ ప్రారంభం

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

స్థానిక ఆర్జియుకెటిలో ఏప్రిల్ 13, 14 తేదీల్లో జరగబోయే టెక్నికల్ ఫెస్ట్ టెక్నివర్స్కు సంబంధించి వెబ్సైట్ www.techni-verse.rguktsklm.ac.inను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ యం.విజయ్ కుమార్ ఆన్లైన్ వేదికగా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టెక్నికల్ ఫెస్ట్లో భాగస్వాములై పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాలను పొందాలని విద్యార్థులకు సూచించారు. క్యాంపస్ డైరెక్టర్ కె.వి.జి.డి. బాలాజీ, ఒఎస్డి సుధాకర్బాబు, ఎఒ ముని రామకృష్ణ, డీన్ కొర్ల మోహన్కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ అసిరినాయుడు, డీన్ వెల్ఫేర్ గేదెల రవి, టెక్నికల్ ఫెస్ట్ కన్వీనర్ సి.ఎచ్.వాసు, కో- కన్వీనర్ కె.దిలీప్ కుమార్, డిప్యూటీ ఎఒ విశ్వనాథ్ బిసై పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న విజయకుమార్

ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిన జగన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో ఐదేళ్ల పాలనలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని, గత ఎన్నికల సమయంలో ఇచ్చిన 85 శాతం హామీలను నేటికీ నెరవేర్చలేదని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ఆరోపించారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మద్య నిషేధం అమలు చేసిన తర్వాత ఓట్లు అడిగేందుకు వస్తానని మహిళలకు నమ్మబలికిన జగన్ రాష్ట్రాన్ని మద్యం, గంజాయి, డ్రగ్స్ ఆంధ్రాప్రదేశ్గా మార్చారని విమర్శించారు. నాసిరకం మద్యం అమ్మకాలు చేపట్టడంతో రాష్ట్రంలోని ప్రజలు రోగాల భారిన పడ్డారని అన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచనని చెప్పిన సిఎం ఐదేళ్లలో 9 సార్లు పెంచేసి ప్రజలపై రూ.64 వేల కోట్లు భారాన్ని వేశారన్నారు. స్టార్ట్ మీటర్లు, మోటార్లకు మీటర్ల కొనుగోళ్లలో రూ.15 వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. 2.30 లక్షల ఉద్యోగాల భర్తీ హామీ ఏమైందని ప్రశ్నించారు. ప్రతి జనవరికి జాబ్ కేలండర్ ఇచ్చామని హామీనిచ్చారని, ఆ హామీ ఏమందని ప్రశ్నించారు. మళ్లీ ఎన్నికల్లో గెలిస్తే భర్తీ చేస్తానని నిరుద్యోగులను మభ్యపెడుతున్నారని అన్నారు. మాయ మాటలు చెప్పి గడచిన ఐదేళ్లలో ప్రజా ధనాన్ని రూ.లక్షల కోట్లు కొల్లగొట్టారన్నారు. కమీషన్ల ప్రభుత్వాన్ని గద్దెదించాలని ప్రజలకు పిలుపు నిచ్చారు.



కూన రవికుమార్

కళాకారులకు శుభాకాంక్షలు

బుధవారం ప్రపంచ కళాకారుల దినోత్సవం సందర్భంగా మండలంలోని గాజుల కొల్లివలస వద్ద ఉన్న సంగమేశ్వర స్వామి ఆలయం వద్ద సైకత శిల్పి గేదెల హరికృష్ణ ఇసుకతో సైకత శిల్పాన్ని మంగళవారం చెక్కారు. ఈ సందర్భంగా కళాకారులకు శుభాంక్షలు తెలియజేశారు. ఈ సైకత శిల్పాన్ని చూసేందుకు చుట్టుపక్కల గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని హరికృష్ణను అభినందించారు.

- ప్రజాశక్తి, ఆమదాలవలస



సింగిల్ విండో విధానంలో
ఎన్నికల సభలకు అనుమతులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సాధారణ ఎన్నికల్లో భాగంగా శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల కార్యకలాపాలకు తప్పక అనుమతులు తీసుకోవాలని, అనుమతులు తీసుకునేందుకు సింగిల్ విధానంలో ఆన్‌లైన్ ద్వారా అనుమతులు పొందవచ్చునని ఆర్‌డిఒ రంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ప్రచార కార్యక్రమం, సమావేశ స్థలం కోసం, లౌడ్ స్పీకర్లు ఉపయోగించేందుకు, ర్యాలీలు, ఊరేగింపులు, పోస్టర్ల పంపిణీ, ఇంటింటికీ ప్రచారం, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, బేనర్లు స్టికర్లు ప్రదర్శించడానికి సింగల్ విండో అనుమతి తీసుకోవాలన్నారు. సంబంధిత శాఖలైన పోలీస్‌శాఖ, మున్సిపల్‌శాఖ, పంచాయతీరాజ్‌శాఖ, విద్యుత్‌శాఖ, అగ్నిమాపకశాఖ, రహదారులు, భవనాలశాఖ అనుమతులు తీసుకోవాలన్నారు. సింగిల్ విండో విధానంలో దరఖాస్తు చేస్తే అనుమతులు మంజూరు చేస్తామన్నారు. నేరుగా, ఆన్‌లైన్ పోర్టల్‌లో, రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సింగల్ విండో పర్మిషన్ సెల్ ధ్రువపత్రాలను జారీ చేస్తుందన్నారు. అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని రాజకీయ పార్టీలకు సూచించారు.


బిఎల్‌ఒలకు సూచనలు చేస్తున్న సుదర్శన్‌దొర

ఎన్నికలపై అప్రమత్తం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రానున్న ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సిబ్బంది, బూత్‌స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుదర్శన్ దొర సూచించారు. స్థానిక మున్సిపల్ కల్యాణ మండపంలో మంగళవారం కవిటి, ఇచ్ఛాపురం మండలాల బిఎల్‌ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఎల్‌ఒలు విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయరాదని, అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశానికి గైర్హాజరైన ఆరుగురికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వాలంటీర్లు ఎన్నికల విధుల్లో ఉండరాదని, ఓటర్ల జాబితాలో మరణాలు, బయట ప్రాంతాలకు వెళ్లిన వారి వివరాలు సేకరించాలన్నారు. డిటి శ్రీహరి, బిఎల్‌ఒలు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చంద్రశేఖర్

ముగిసిన భద్రతా వారోత్సవాలు

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని పైడిభీమవరం పారిశ్రామిక వాడలో అపిటోరియ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్-4 (అరబిందో) పరిశ్రమలో 53వ జాతీయ భద్రత వారోత్సవ ముగింపు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యకమానికి డైరక్టర్ ఆప్ ప్యాక్టరీస్ డి.చంద్రశేఖర్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరిస్ బి.రాంబాబు పాల్గొని మాట్లాడుతూ ఏ పరిశ్రమ అయినా అభివృద్ధి పథంలో నడవాలన్నా కార్మికులు, పరిశ్రమ భద్రత ముఖ్యమన్నారు. ఈ ముగింపు వేడుకలను పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులు సైట్ హెడ్ మదన్ కుమార్, సైట్ సేఫ్టి హెడ్ సంపత్ రెడ్డి, హెచ్‌ఆర్ హెడ్ కమలాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.


ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న గాంధీ

గాంధీ ఇంటింటా ప్రచారం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఒక్క ఛాన్స్ ఇవ్వండి అభివృద్ధి చేసి చూపిస్తానని స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీ ప్రజలను కోరారు. మంగళవారం మండలంలోని కొత్తవలసలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి తనకు ఒక్క అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఓటర్లను కోరారు. దశాబ్ద కాలం నుంచి నియోజకవర్గంలో కుటుంబ రాజకీయాలు చేస్తున్న ఇరువురు నాయకులు యువతకు ఏమి చేసారో చెప్పాలని డిమాండ్ చేసారు. ఉత్తుత్తి హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్న ఇరువురు నాయకులకు ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణ, పొందూరు మాజీ ఎంపిపి సువ్వారి దివ్య, బొడ్డేపల్లి మన్మధరావు, రాజేష్, దవల రాజారావు, కూన పైడినాయుడు, గురుగుబెల్లి శ్రీను, సువ్వారి అనిల్ కుమార్, పేడాడ వైకుంఠరావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పివిఆర్

ఎన్నికల్లో పోటీకి సిద్ధం

లావేరు: ఉత్తరాంధ్ర తెలగ వర్గాన్ని బిసి జాబితాలో చేర్చడానికి తమ ఎన్నికల మేనిఫెస్టోలో ఏ రాజకీయ పార్టీ ముందుకు రాకపోతే ఎన్నికల్లో తెలగ వర్గం పోటీ చేస్తామని ఉత్తరాంధ్ర తెలగ సంఘం నాయకులు పల్లంట్ల వెంకట రామారావు అన్నారు మంగళవారం లావేరులో ఎచ్చెర్ల నియోజకవర్గ తెలగ వర్గంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలగ వర్గాన్ని 1960 వరకు బిసి జాబితాలో ఉండేదని, ఈ తరువాత బిసి జాబితా నుంచి తొలగించడంతో ఆర్థికంగా, సామాజికంగా, విద్యా, ఉద్యోగపరంగా నష్టపోతున్నారన్నారు. టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా తెలగ వర్గాన్ని బిసి జాబితాలో చేర్చేవరకు ముందుకు వెళ్తామన్నారు. సమావేశంలో సంఘ నాయకులు పైడి శ్రీనువాసరావు, యినపకుర్తి తోటయ్యదొర, లంకలపల్లి ప్రసాద్, సిపి రౌతు శ్రీనువాసరావు, బాలబొమ్మ చిన్న శ్రీను, దేశెట్టి తిరుపతిరావు, యినపకుర్తి పోతన్నదొర, బాడిత లక్ష్మణరావు పాల్గొన్నారు.

రేపు అరసవల్లి హుండీ ఆదాయం లెక్కింపు

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్య నారాయణస్వామి ఆలయ హుండీలను ఈ నెల 28న ఉదయం 8 గంటలకు లెక్కిస్తామని ఉప కమిషనర్ ఎస్.చంద్రశేఖర్ ఒక ప్రకటనల తెలిపారు. దేవాదాయ, ధర్మాదాయశాఖ సిబ్బంది, అనువంశిక ధర్మకర్త, పాలక మండలి సభ్యులు, అర్చకులు, యాత్రికులు, గ్రామ పెద్దల సమక్షంలో హుండీలను తెరవనున్నట్లు తెలిపారు.

లస్సీ పంపిణీ

కవిటి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల సమయంలో ఎండ తీవ్రత దృష్ట్యా ఐదు రోజులుగా బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద యువకులు పలు రకాల పానీయాలు పంపిణీ చేస్తోంది. ఈ సందర్భంగా ఆరో రోజు విశ్వాస్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు బెందాళం పద్మావతి, బాలకృష్ణ ఆర్థిక సాయంతో సుమారు 350 మంది విద్యార్థులకు మంగళవారం లస్సీ పంపిణీ చేశారు. దాతల సహకారంతో పదో తరగతి పరీక్షలు పూర్తయ్యే వరకూ నిరాటంకంగా కొనసాగిస్తామని తెలిపారు.

కళారంగంలో కలికితురాయి కుమార్‌నాయక్

● రంగస్థలంలో రాణిస్తున్న బహుముఖ ప్రజ్ఞాశాలి
● నేడు ప్రపంచ రంగస్థలం దినోత్సవం


నటిస్తున్న కుమార్‌నాయర్
(ఇన్‌సెట్‌లో కుమార్ నాయక్)

ప్రజాశక్తి- పలాస

భారతీయ సాహిత్యం నుంచి పుట్టిన రమనీయ వాక్యం 'కావ్యేసు నాటకం రమ్యం' జీవితమే ఒక రంగస్థలం అయితే అందులో ప్రతి మనిషీ ఒక పాత్రధారుడే. హెలెన్ స్కి జాతీయుడైన ఆర్వి కివిమా 1961 మార్చి 27న వియాన్నాలో మొట్ట మొదటిసారి 'ప్రపంచ రంగస్థల దినోత్సవం' పేరిట ఒక వేడుక జరిపాడు. నాటి నుంచి రంగస్థలానికి ప్రపంచదేశాలు అమలుకు శ్రీకారం చుట్టాయి.

కళామతల్లి సేవలో నిమగ్నమైన కుమార్ నాయక్ ఒక సామాన్య రైతు కుటుంబంలో 1961లో జన్మించారు. రాజనీతి శాస్త్రం బీసామాజిక శాస్త్రంలో డబల్ ఎంఎలో పట్టభద్రులు. జానపదుల జాడ నేడు యాడున్నదో అను అంశంపై రీసెర్చ్ చేసి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. తన 14వ ఏట 9వ తరగతి చదువుతున్న సమయంలో కోయడాన్స్ ట్రూపులో చేరి కాలి అందియలకు మువ్వలు కట్టారు. కోలాటంబీ చెక్క భజనలు , గ్రామ దేవత ఉత్సవాలు, సంక్రాంతి పండగలో పగటి వేషాలతో ప్రారంభమైన కళారంగ ప్రస్థానం ప్రస్తుత నటుడిగా, దర్శకునిగా, సందర్భాచిత రచయితగా, న్యాయ నిర్ణేతగా కళామతల్లి సేవలో ఉన్నారు.

సన్నాసోడి పెళ్లాం, జాలారి జంగమయ్య, సూరి గాడికి చదువొచ్చే, కంచం కాదంటుంది సదువు రాని సర్పంచ్, లంకె బిందెలో లక్కాయి పిక్క, కోయదొర కొంటె దంపతులు, చిలక జోస్యం, సోది చెబుతాను, భైరవకోన, చీడపురుగులు, కొత్త చిగురు, నాటు మందు, పిడికిలి, విజన్-420, ట్రీట్మెంట్, నీతి నీ స్థానం ఎక్కడ? కొడుకు పుట్టాలా? దాడి నాటికలు నాటకాల్లో నటునిగా, దర్శకునిగా ప్రతిభ కనబరిచారు.

ప్రశంసలు...

నాగాలాండ్ గవర్నర్ గణేషన్, ఒడిశా మాజీ సిఎం గిరిధర్ గమంగో, అవధాని బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ, స్వాతంత్ర సమరయోధుడు వావిలాల గోపాలకృష్ణయ్య, వాగ్గేయ కళాకారుడు యుద్ధ నౌక గద్దర్, అప్పటి శ్రీకాకుళం కలెక్టర్లు బి.డి.దానం, అనిల్ చంద్ర పునేఠ, ఉమ్మడి రాష్ట్ర మంత్రులు తమ్మినేని సీతారాం, పల్లె రఘునాథ్‌రెడ్డి, గౌతు శ్యామసుందర శివాజీ, ప్రస్తుత మంత్రి సీదిరి అప్పలరాజు చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

వైసిపి విస్తృత ప్రచారం


మెళియాపుట్టి : ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి


కోటబొమ్మాళి : ప్రచారం చేస్తున్న నాయకులు

మెళియాపుట్టి: సిఎం జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి పేదలకు అండగా నిలిచారని, రానున్న ఎన్నికల్లో ఆయనకు అందరూ మద్దతు ఇవ్వాలని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని కేరాసింగి, కేరాసింగి గూడ, చందనగిరి గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ ఐదేళ్లలో అందించిన సంక్షేమ పథకాల లబ్దిని వివరించారు.

అలాగే మెళియాపుట్టి, చాపర గ్రామాల్లో ఎమ్మెల్యే తనయుడు రెడ్డి శ్రావణ్ గుడ్ మార్నింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాకింగ్ చేస్తున్న వారిని, పలువురు వ్యాపారులను, టీ దుకాణం వద్దకు వచ్చిన వారిని కలిసి రానున్న ఎన్నికల్లో వైసిపికి ఓటు వేసి రెడ్డి శాంతిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్ కుమార్, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్లాన బాలరాజు, మండల కన్వీనర్ పల్లి యోగి, జయముని, తంగుడు రమేష్, నాయకులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: పట్టణంలో 4వ వార్డులో ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వైసిపి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వివరిస్తూ ఓటర్లకు పోస్టర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, పార్టీ పరిశీలకులు చింతాడ రవి, మాజీ ఎమ్మెల్యే నరేష్ కుమార్ అగర్వాల్, సీడ్ ఎపి చైర్మన్ శాడి శ్యాం ప్రసాద్ రెడ్డి, రెడ్డిక కార్పోరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలకా రాజ్యలక్ష్మి, బొర పుష్ప, పైలా దేవదాస్ రెడ్డి పాల్గొన్నారు.

కొత్తూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పాతపట్నం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న రెడ్డి శాంతిని ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి గెలిపించాలని ఎమ్మెల్యే తనయుడు ఓం శ్రీ కృష్ణ మదనాపురం, ఆర్.కె.పురంలో ప్రజలను అభ్యర్థించారు. ఈయన వెంట వైసిపి మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, సర్పంచ్ కొంచాడ వెంకట రమణయ్య, ఎంపిటిసి వి.లక్ష్మీనారాయణ, వైసిపి నాయకులు జి.ఆనందరావు, బి.శ్రీను ఉన్నారు.

కోటబొమ్మాళి: మండలంలో పట్టుపురం పంచాయతీ కిత్తయ్యపేట, యండపేట, పట్టుపురం గ్రామాల్లో సర్పంచ్ మెట్ట ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో ఎంపిపి రోణంకి


ఇచ్ఛాపురం : ప్రచారం చేస్తున్న తిలక్, విజయ తదితరులు


వజ్రపుకొత్తూరు : ప్రచారం చేస్తున్న నాయకులు

ఉమామల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు నూక సత్యరాజు, వైసిపి నాయకులు ఇంటింటికి వెళ్ళి ఎమ్మెల్యేగా దువ్వాడ శ్రీనివాస్, పార్లమెంటు అభ్యర్థిగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, సచివాలయ కన్వీనర్ గడ్డవలస నాగభూషణరావు, మండల విప్ బొడ్డు అప్పన్న, నాయకులు కవిటి రామరాజు, పేడాడ వెంకటరావు, బమ్మిడి గణపతి పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని సుంకర జగన్నాధపురంలో ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, వైసిపి నాయకులు ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా డాక్టర్ సీదిరి అప్పలరాజు, పేరాడ తిలక్‌లను ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి దున్న బాలరాజు, మాజీ సర్పంచ్ గున్నమ్మ, వైసిపి నాయకులు డాక్టర్ దున్న కృష్ణారావు, జోగారావు పాల్గొన్నారు.

టిడిపి ఇంటింటా ప్రచారం


పొందూరు : పార్టీలో చేరిన చేనేత కుటుంబాలతో రవికుమార్

ప్రజాశక్తి- పొందూరు

మండలం లోలుగులో టిడిపి జిల్లా అధ్యక్షులు, ఆముదాలవలస ఎమ్మెల్యే అభ్యర్థి కూన రవికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం శంఖారావం పేరుతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వాన్ని గద్దెదించడానికి రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు సిహెచ్ రామ్మోహన్, అన్నెపు రాము, చింతాడ వాసుదేవరావు, లోలుగు వెంకట్, సీపాన శ్రీరంగనాయకులు, వండాన మురళి, గిరి, శ్రీనివాసరావు, జగన్మోహనరావు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

మండల కేంద్రంలోని లావేటి వీధికి చెందిన బల్ల సంతోష్ ఆధ్వర్యంలో 25 చేనేత కార్మిక కుటుంబాలు మంగళవారం టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ సమక్షంలో టిడిపిలో చేరాయి. వీరికి రవి కుమార్ పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సిహెచ్ రామ్మోహన్, పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సీపాన శ్రీరంగ నాయకులు, మండల కార్యదర్శి వండాన మురళి, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకర్ భాస్కర్, మండల ఉపాధ్యక్షులు బాడన శేషగిరి, పట్టణ అధ్యక్షులు ఎ.చినరంగ, ఎంపిటిసి వాణి పాల్గొన్నారు.

కవిటి: మండలం కుసుంపురం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ, సూపర్ సిక్స్ పథకాలపై ఎమ్మెల్యే


కవిటి : ప్రచారం చేస్తున్న నీలోత్పల, రాజు

అశోక్ సతీమణి నీలోత్పల, జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి టిడిపి, జనసేన కూటమి అధికారంలోకి వస్తే అమలు చేసే ఆరు పథకాలు వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బెందాళం రమేష్, సంతోష్ పట్నాయక్, కొర్రాయి వాసుదేవ్, సురేష్, బార్ల చినబాబు, వజ్జ రంగారావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకటరమణ

ప్రజల మధ్యకు వెళ్తా...

ప్రజాశక్తి- కొత్తూరు

కొత్తూరు మండలం మాతలలో కలమట క్యాంప్ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ పరిధిలో గల క్లస్టర్, యూనిట్ ముఖ్య నాయకులతో కలమట వెంకటరమణ సమావేశం ఏర్పాటు చేశారు. ఇటీవల విడుదల చేసిన టిడిపి అభ్యర్థుల జాబితాలో కలమట వెంకటరమణ పేరు తప్పిస్తూ వేరొక వ్యక్తిని అభ్యర్థిగా ప్రకటించడంతో దానిని వ్యతిరేకిస్తూ నియోజకవర్గంలో రానున్న రోజుల్లో పర్యటన చేసి మాజీ ఎమ్మెల్యే కలమటకు టిడిపి అధిష్టానం చేసిన పొరపాటును ప్రజలకు తెలియచేయనున్నట్టు సమావేశంలో కార్యాచరణ రూపొందించారు.

నైపుణ్యాభివృద్ధికి కృషి

శ్రీకాకుళం అర్బన్ : నిరుద్యోగ యువతీ యువకులకు నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పనలో భాగంగా ఈ నెల 27న సత్య సాయి స్కిల్ డెవలప్‌మెంట్‌ంట్ శాశ్వత భవనాన్ని ప్రారంభించనున్నట్టు సత్యసాయి బృందావనం కన్వీనర్ ఎ.ప్రసాదరావు తెలిపారు. నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో ఉన్న సత్యసాయి బృందావనంలో నిర్వహించిన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే సేవా సమితి ఆధ్వర్యాన అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. శాశ్వత స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా నిరుద్యోగ యువతకు పూర్తిస్థాయిలో శిక్షణ అందిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో వి.చిట్టిదాసు, పి.మల్లేశ్వరరావు, డోకి జనార్థనరావు తదితరులు పాల్గొన్నారు.

ఎలుగుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- పలాస

ఉద్దాన ప్రాంతం జీడి తోటల్లో ఎలుగులు సంచరిస్తున్నాయని, ఇప్పటికే ఎంతో మంది ఎలుగు దాడిలో మృతి చెందారని, రైతులపై ఎలుగు దాడి చేయకుండా చర్యలు చేపట్టాలని రైతాంగ సమస్యల సాధన కమిటీ, బొడ్డపాడు యువజన సంఘం నాయకులు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఆర్‌డిఒ కార్యాలయంలో మంగళవారం రైతాంగ సమస్యల సాధన కమిటీ, బొడ్డపాడు యువజన సంఘం ఆధ్వర్యంలో ఆర్‌డిఒ భరత్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలుగుబంట్లు దాడుల్లో చనిపోయిన వారికి ప్రభుత్వం రూ.10 లక్షలు, గాయపడిన వారికి రూ.ఐదు లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎలుగు బంట్లు దాడుల నుంచి ప్రజలను రక్షించి తగు నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. రైతులు పండించే పంటలను నాశనం చేస్తున్నా వన్యప్రాణులు (అడవి పందులు) నుంచి రక్షణ


వినతిపత్రం అందజేస్తున్న సాధన కమిటీ, యువజన సంఘం నాయకులు

చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఉద్దాన ప్రాంతంలో జీడి రైతులు ఎలుగు బంట్లుకు బలైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వినతిపత్రం అందించిన వారిలో పుచ్చ దుర్యోధన, దాసరి శ్రీరాములు, జైభీం యువజన సంఘం అధ్యక్షుడు ఢిల్లీరావు, గుణవంతు, తామడ రామారావు, తామడ గంగయ్య, ఎం.ధర్మారావు, తామడ అప్పారావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తిలక్

సమిష్టిగా కృషి చేయాలి

ఇచ్ఛాపురం: రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో నాయకులు విబేధాలు వీడి సమిష్టి కృషితో విజయం సాధిస్తామని వైసిపి నాయకులు స్పష్టం చేశారు. స్థానిక రోటరీ కమ్యూనిటీ భవనంలో మంగళవారం విస్తృతస్థాయి సమావేశానికి నియోజకవర్గానికి చెందిన ముఖ్య నేతలు ఒకే వేదికపైకి వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ విజయానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఎంపి అభ్యర్థి పేరాడ తిలక్ మాట్లాడుతూ వైసిపి నేతలందరూ కలిసికట్టుగా ముందుకు రావడం శుభసూచకమని, జిల్లాలో మిగిలిన ప్రాంతాల్లో కూడా ఇలా సమిష్టిగా ముందుకు వచ్చి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. జిల్లా ఎంపీగా పదేళ్ల పాలించినా ఒక్క అభివృద్ధి కార్యక్రమాలు చేయలేదని రామ్మోహన్ నాయడు పనితీరుపై తిలక్ విమర్శించారు. ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో నియోజకవర్గంలో రూ.2,600 కోట్లు సంక్షేమం, అభివృద్ధి కోసం వెచ్చించడం జరిగిందన్నారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు మాట్లాడుతూ ఈసారి టిడిపి కంచుకోటలో వైసిపి జెండా ఎగుర వెయ్యడం తథ్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు చింతాడ రవి కుమార్, నరేంద్ర యాదవ్, మాజీ ఎమ్మెల్యే నరేష్ కుమార్ అగర్వాల్, చైర్‌పర్సన్ పిలకా రాజ్యలక్ష్మి, ఎంపిపిలు బొర పుష్ప, దేవదాసు రెడ్డి, జెడ్‌పిటిసి నారాయణమ్మ, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, తడక జోగారావు పాల్గొన్నారు.

ఓటు వినియోగంపై అవగాహన



సరుబుజ్జిలి : ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేస్తున్న మహిళా సంఘ సభ్యులు

సంతబొమ్మాళి : మండలంలో సంతబొమ్మాళి ప్రధాన కేంద్రంలోని వీధుల్లో, గోవిందపురం పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామాల్లో ఓటర్లకు ఓటు హక్కు వినియోగం అవస్యకతపై తహశీల్దార్ జి.సత్యనారాయణ, ఎంసిసి టీం స్పెషల్ ఆఫీసర్ వి.వెంకటేశ్వర్లు అవగాహన కల్పించారు. ఓటు హక్కు వినియోగంపై బిఎల్‌ఒలు బైక్ ర్యాలీ నిర్వహించారు. గోవిందపురం పంచాయతీ వల్లేవలస పోలింగ్ కేంద్రం నంబరు 198, 199 నందు తహశీల్దార్ ఓటర్లతో ఓటు వినియోగంపై అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సనపల ఢిల్లేశ్వరరావు, ఎపిఎం సూర్యనారాయణ, విఆర్‌ఒ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: మహిళలు అందరూ ఓటు హక్కు వినియోగించుకోని ప్రజాస్వామ్యాని కాపాడాలని వెలుగు సిబ్బంది ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. టెక్కలి మేజర్ పంచాయతీ గోపినాథపురంలో ఓటుహక్కుపై మహిళలకు అవగాహన కల్పించారు. ఎపిఎం గురుబెల్లి నారాయణరావు, సిసిలు పద్మ, వరదరాజులు, విఎఒ భవానీ పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును ప్రజలందరూ వినియోగించుకోవాలని వెలుగు ఎపిఎం కమల కుమారి పాండ్యన్ అన్నారు. మండలంలోని పురుషోత్తపురంలో ఓటుహక్కు వినియోగంపై స్వయం సహాయక సంఘ సభ్యులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వెలుగు సిసి కూన రోజాలత, సచివాలయ మహిళా పోలీస్ బాలమణి, విఆర్‌ఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సంతబొమ్మాళి : అవగాహన కల్పిస్తున్న అధికారులు

తాపీమేస్త్రీ దుర్మరణం


గున్నయ్య మృతదేహం

ప్రజాశక్తి- పలాస

విద్యుదాఘాతానికి గురై తాపీమేస్త్రీ మృతి చెందిన సంఘటన మందస మండలం సువర్ణపురంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు సాలీన గున్నయ్య (40) సువర్ణపురంలో గృహనిర్మాణ పనులు నిర్వహిస్తున్నారు. ప్రమాదవశాత్తు 11 కెవి విద్యుత్ తీగకు తాపీ తగిలి విద్యుత్‌షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు 108కు సమాచారం అందించగా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని గున్నయ్య మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు గున్నయ్య స్వగ్రామం పలాస మండలం మాకన్నపల్లి కాగా ప్రస్తుతం మందస మండలం బాహడపల్లిలో అత్తవారింట ఉంటూ తాపీమేస్త్రిగా జీవనం సాగిస్తున్నాడు. జీవనోపాధి నిమిత్తం గృహ నిర్మాణ పనులకు వెళ్లిన గున్నయ్య విద్యుత్ ఘాతానికి గురై విగతాజీవిగా మారడంతో కుటుంబసభ్యులు బోరున విలపిస్తున్నారు. మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



లారీ ఢీకొని జవాను మృతి

ప్రజాశక్తి- పలాస

ఆయన ఏడు నెలలు శిక్షణ పొందుతున్న సిఆర్‌పిఎఫ్ జవాను సెలవు వచ్చారు. ఇంతలో ఇసుక లారీ రూపంలో మత్యువు కబలించింది. పలాస జాతీయ రహదారి కోసంగిపురం కూడలి వద్ద ఇసుకలారీ చక్రాల కింద పడి చెల్లూరు చిరంజీవి (27) మంగళవారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సోంపేట మండలం బేసి రామచంద్రాపురం పంచాయతీ జీడిపుట్టుగకు చెందిన చెల్లూరు చిరంజీవి ద్విచక్ర వాహనంపై పలాస మండలం అమలపాడులో నివాసం ఉంటున్న తన తాత వాళ్ల ఇంటికి వెళ్తున్నాడు. ఈ సమయంలో ఎదురుగా వస్తున్న ఇసుక లారీ ఢీకొడంతో లారీ కింద పడిపోయాడు. శరీరంపై నుంచి లారీ చక్రాలు వెళ్లడంతో అపస్మారకస్థితికి చేరుకున్నాడు. అంతకు ముందు తనను కాపాడండి కాపాడండి అంటూ కేకలు వేశాడు. ఘటనా జరిగిన వెంటనే 108 అంబలెన్స్ సిబ్బంది ఆయనను పలాస ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతుడు బీహార్ రాష్ట్రంలో ఏడు నెలల క్రితం సిఆర్‌పిఎఫ్ జవానుగా విధుల్లో చేశారు. నెల రోజుల పాటు సెలవులు కావడంతో తన తల్లి అన్నపూర్ణ, తాత, కుటుంబీకులతో సరదాగా గడుపుదామని వచ్చి ఇసుక లారీకి బలైపోయాడు. దీంతో ఆయన కుటుంబంలో తీవ్ర విషాదం అలముకుంది. సంఘటన స్థలానికి కటుంబీకులు, స్నేహితులు చేరుకొని కన్నీరుమున్నీరుగా విలపించారు. ఎంతో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తాడని. కుటుంబాన్ని పోషిస్తాడని అనుకున్న తరుణంగా ఈ విధంగా రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందుతాడని తాము ఊహించలేకపోయామని కుటుంబ సభ్యులు పెడుతున్న రోదన అంతా ఇంతా కాదు. కాశీబుగ్గ ఎస్ఐ వెంకటరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

సెల్‌టవర్ ఏర్పాటు చేయొద్దు

ప్రజాశక్తి- పొందూరు

మండలం తాడివలసలో పంచాయతీ అనుమతి లేకుండా సెల్‌టవర్ నిర్మాణం చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ గ్రామస్తులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. గ్రామ సమీపంలో ఎయిర్‌టెల్ సెల్‌టవర్ నిర్మాణం చేపట్టడం వలన రేడియేషన్ ప్రభావంతో ఇబ్బంది పడాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీలో టవర్ నిర్మాణం చేపడుతున్నట్లు కనీస సమాచారం లేదని సర్పంచ్ మణమ్మ తెలిపారు. దీనిపై కంపెనీ ఉద్యోగి సంతోష్‌ను వివరణ కోరగా జిఒ నంబర్-2 ప్రకారం ఆన్‌లైన్ ప్రత్యేక పోర్టల్‌లో ధరఖాస్తు చేస్తామని, పంచాయతీ అనుమతి ఇంకా తీసుకోలేదని చెప్పారు.


ఆక్రమణలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ తదితరులు

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ఆక్రమణదారులు ఎవరైనా ప్రభుత్వ స్థలాలు అక్రమిస్తే కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎచ్చర్ల పద్మజ అన్నారు. మండల కేంద్రంలో చిన్న పొందరవీధిలో అంగన్వాడీ కేంద్రానికి సంబంధించిన ప్రహరీగోడను తొలగించి సుమారు 6 అడుగుల లోపలకి వచ్చి ప్రభుత్వ స్థలాన్ని అక్రమించి నిర్మాణాలు జరుపు తున్నారని ఫిర్యాదు రావడంతో అమె మంగళవారం ఇఒపిఆర్‌డి ఎస్.రామారావుతో కలిసి అక్రమణలు పరిశీలించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మాణాలు జరపటం చట్టరీత్యా నేరమని, వెంటనే నిర్మాణాలు అపివేయాలని లేకుంటే వాటిని తొలగించటంతో పాటు ఆక్రమణ దారులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సత్యప్రియ ఇఒ చింతాడ శ్రీనివాస్ ఉన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ వైకుంఠరావు తెలిపారు. మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల 2024-25 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్ ద్వారా ఎంపిసి, బైపిసి, సిఇసి, ఎంఇసి గ్రూపులకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు తెలిపారు. ఈ నెల 28 నుంచి మే 22 వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి రాజశేఖర్

403 మందికి వైద్య పరీక్షలు

బూర్జ: మండలంలోని నీలాదేవిపురంలో బూర్జ పిహెచ్‌సి వైద్యాధికారులు రాజశేఖర్, పావని ఆధ్వర్యంలో మంగళవారం ఆరోగ్య సురక్షా కార్యక్రమం ద్వారా 403 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణీలు, బాలింతలు, వృద్ధులకు ప్రత్యేక వైద్యం పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పావని మాట్లాడుతూ రానున్న వేసవికాలంలో వృద్ధులు, చిన్నారులు ఎండ తీవ్రతను తట్టుకునే సమర్థత తక్కువ ఉంటుందని అవసరమైన గ్లూకోజ్, బార్లీ వంటివి ఎప్పటికప్పుడు వారికి అందించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ సరోజిని, సిహెచ్ఒ అప్పలస్వామి, ఎంఎల్‌హెచ్‌పి లు, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న టిడిపి నాయకులు

టిడిపి నాయకుల పరామర్శ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఇటీవల ఎలుగు దాడిలో మృతి చెందిన కూర్మారావు, లోకనాథం కుటుంబాలను మంగళవారం టిడిపి పలాస నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి పరామర్శించి మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈయనతో పాటు మాజీ ఎంపిపి గొరకల వసంతస్వామి, టిడిపి మండల అధ్యక్షులు సూరాడ మోహనరావు, లైశెట్టి భీమారావు, కుంది దుర్గారావు, కోడ రామన్న, కేశవరావు ఉన్నారు.


శిథిలావస్థలో ఉన్న ఆర్‌అండ్‌బి బంగ్లా

శిథిలావస్థలో ఆర్‌అండ్‌బి బంగ్లా

ప్రజాశక్తి- రణస్థలం

మండల కేంద్రం, 16 నెంబర్ జాతీయ రహదారికి అనుకుని ఉన్న బ్రిటీష్ హయాంలో నిర్మించిన ఆర్‌అండ్‌బి బంగ్లా శిథిలావస్థకు చేరింది. గతంలో జిల్లా సందర్శించేందుకు వచ్చే పర్యాటకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ బంగ్లాలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకునేవారు. అధికారులు బంగ్లాను వదిలేయడంతో శిథిలావస్థకు చేరుకుంది. గతంలో ఈ బంగ్లాలో ఒక అటెండర్, వాచ్‌మేన్, పనిచేసే సిబ్బంది ఉండేవారు. వారు రిటైర్మెంట్ అయిన తరువాత ఆ సిబ్బందిని నియమించకపోవడంతో బంగ్లా ఆలనాపాలనా చూసేవారు లేక శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం ఈ శిథిల భవనంలో చీకటి కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయి. అలాగే పూర్తిగా విడిచిపెట్టడంతో విష సర్పాలకు నిలయంగా మారింది. అధికారులు స్పందించి ఈ భవనాన్ని పూర్తిగా తొలగించి నూతనంగా నిర్మించి వినియోగంలోకి తీసుకువస్తే ప్రయోజనంగా ఉంటుందని పలువురు కోరుతున్నారు

కాలువలు లేక అవస్థలు

రణస్థలం: మండలం జె.ఆర్.పురం గ్రామ పంచాయతీ గొల్లవీధిలో మురుగునీరు వెళ్లేందుకు అవకాశం లేక రోడ్డుపైన మురుగునీరు నిల్వ ఉండిపోతుంది. దీంతో అక్కడి ప్రజలు దోమలతో పాటు దుర్వాసనతో అవస్థలు పడుతున్నారు.ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మురుగునీరు బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టి కాలువలు నిర్మించాలని కోరుతున్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు


ఆమదాలవలస : అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటేష్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాదరావు హెచ్చరించారు. నగరంలోని డే అండ్ నైట్ వద్ద పలు వాహనాలను మంగళవారం తనిఖీ చేపట్టారు. ప్రమాద నివారణా చర్యల్లో భాగంగా వాహనాలు నడుపుతున్న మైనర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంటుందని అన్నారు. వాహనం నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలతో పాటు వాహనదారులు నియమాలు తప్పక పాటించాలన్నారు. నింబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలు నడిపే సమయంలో తప్పక డ్రైవింగ్ లైసెన్స్ తమ వద్ద ఉంచుకోవాలన్నారు.

ఆమదాలవలస: ద్విచక్ర వాహనాలపై ప్రయాణం చేసే వాహనదారులు ప్రమాద సమయంలో రక్షణగా ఉపయోగపడే హెల్మెట్‌ను ధరించాలని ఎస్ఐ కె.వెంకటేష్ అన్నారు మంగళవారం రైల్వే అండర్ టన్నెల్ జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యకృత్యంగా మారిన రోడ్డు ప్రమాదాలతో హెల్మెట్ ధరించని ఎంతోమంది ద్విచక్ర వాహనదారులు మృత్యువాత పడుతున్నారన్నారు. ఇటీవల ఇదే ప్రాంతంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని హెల్మెట్ లేని కారణంగా తలకు తీవ్రగాయమై జాడ దుర్గారావు అనే వ్యక్తి మృత్యువాత పడ్డారని ఎస్ఐ తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా పాటించి సురక్షిత ప్రయాణంతో పాటు ప్రాణ రక్షణతో తమ కుటుంబాలకు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'ధర్మాన'కు ఓటమి భయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు ఓటమి భయం మొదలైందని, అందుకే టిడిపిలో చిచ్చుపెట్టి లబ్ధిపొందాలని చూస్తున్నారని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. నగరంలోని విశాఖ-ఎ కాలనీలో ఉన్న తన నివాసంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలోని టిడిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అంతా సమిష్టిగానే పోరాడతామని అన్నారు. సమిష్టి పోరాటం ద్వారానే విజయాన్ని అందుకుంటామన్నారు. ధర్మాన తరగతుల వారీగా విభజించి గ్రామాల్లో చిచ్చుపెడుతున్నారని, వైసిపికి మద్దతుగా నిలవకపోతే సంక్షేమ పథకాలు ఆపేస్తామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. అన్ని సామాజిక తరగతులతో సమన్వయంతో ముందుకెళ్తామని అన్నారు. అనంతరం టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలు సందర్భంగా కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.


కేక్ కట్‌చేస్తున్న గొండు శంకర్

పనులను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

పలాస: మండలం బొడ్డపాడులో అమరులైన కుమారన్న, జయమ్మ స్మారక భవనం నిర్మాణ పనులు జరుగుతున్న తరుణంలో గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారని, ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ధ్వంసం చేసిన నిర్మాణ పనులను వామపక్ష నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్రోహ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎవరికైనా ఏవైనా సమస్యలుంటే ప్రభుత్వంతోనే తేల్చుకోవాలి తప్ప అమరుల స్ఫూర్తికి జ్ఞాపకంగా ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో కమిటీ చేపడుతున్న అమరుల స్మారక భవన నిర్మాణాన్ని రాత్రి వేళ కొందరు దొంగచాటుగా విధ్వంసం చేయడం సరికాదన్నారు. భవిష్యత్‌లో ఇదే పద్ధతిని పునరావృతం చేస్తే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని వారు హెచ్చరించారు. పరిశీలిస్తున్న వారిలో సిపిఐ నాయకులు చాపర వేణు, సిపిఐ (యం.యల్) లిబరేషన్ జిల్లా నాయకులు తామాడ సన్యాసిరావు, సిపిఐ (యం.యల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, ఉత్తరాంధ్ర మహిళా సంఘం కార్యదర్శి పి.అరుణ, ప్రజా కళా మండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.నీలకంఠ, ఎపి రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గురయ్య, బొడ్డపాడు సర్పంచ్ తామాడ మదన్ పాల్గొన్నారు.

ఆచ్ఛాదన పంటలతో నేలకు మేలు

ప్రజాశక్తి- రణస్థలం

రబీలో మొక్కజొన్న పంట అనంతరం వేసవి పంటలు వేయడం వలన భూగర్భ జలాలు ఆవిరి కాకుండా కాపాడవచ్చని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని వెంకటాపురం, ఇజ్జాడపాలెం, భరిణికాం, లింగాలవలస గ్రామాల్లో రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు వేసవి పంట విత్తనాలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదు అవుతున్నాయని, వేసవి దుక్కుల


రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న తవిటినాయుడు

పేరిట నేలను పలుమార్లు దున్నడం వలన నేలలోని తేమ ఆవిరైపోవడమే కాకుండా, నేలలోని ఉపయోగకర సూక్ష్మ జీవులు కూడా కనుమరుగైపోతాయన్నారు. వేసవిలో పప్పు ధాన్యాలు, నూనె గింజల వంటి ఆచ్ఛాదన పంటల వలన నేలకు పోషకాలు అంది నేల సారవంతం అవుతుందన్నారు. ఆరువేల ఎకరాలకు సరిపడా నీటి ఎద్దడిని తట్టుకునే పెసర, మినుము, నువ్వుల విత్తనాలు ఉచితంగా పంపిణీకి సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పి.రాము, పి.గురునాయుడు, రాము, రైతులు పాల్గొన్నారు.


కేకు కట్ చేస్తున్న మాజీ ఎంపిపి మోహనరావు

అచ్చెన్న జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలు మంగళవారం నిర్వహించారు. మాజీ ఎంపిపి సలాన మోహనరావు ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించి కేకును కట్ చేశారు. అలాగే వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 50మంది పేద వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి పద్మావతి, ఎల్లం నాయుడు, తిరుపతి, కూర్మారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


దీక్షలో పాల్గొన్న బెంతు ఒరియా ప్రతినిధులు

20 ఏళ్లుగా మోసపోతూనే ఉన్నాం

ప్రజాశక్తి- కవిటి

ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ అధికారుల తీరుతో గత 20 ఏళ్లుగా బెంతు ఒరియాలు మోసపోతూనే ఉన్నారని బెంతు ఒరియా ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో బెంతు ఒరియాలు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు 90వ రోజుకి చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్తిస్థాయిలో కులం, ఉపకులం పేరుతో కూడిన ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ జారీ చేయకపోవడంతో బెంతు ఒరియా విద్యార్థులు ఉపాధి, ఉన్నత చదువులు కోల్పోతున్నారన్నారు. ఈ కారణంతో అనేక మంది బెంతు ఒరియా విద్యార్థులు చదువుకి దూరమై, చేతి వృత్తులపై ఆధారపడుతూ జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సుమన్ బిసాయి, దుదిష్టి మజ్జి, మేగనాధ్ బిసాయి, బృందావన్ బిసాయి, కృష్ణ దొలై పాల్గొన్నారు.

ఉన్నతంగా ఆలోచించాలి

ప్రజాశక్తి- టెక్కలి

డిగ్రీ చదువుతున్న విద్యార్థులు సమాజంపై అవగాహన పెంచుకొని తమ భవిష్యత్, జీవిత లక్ష్యానికి ఉన్నతంగా ఆలోచించాలని వైద్యులు దానేటి శ్రీధర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల వీడ్కోలు సమావేశం మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు తమ చదువులతో పాటు భవిష్యత్‌లో ఎంచుకోవాల్సిన జీవిత లక్ష్యం వైపు గమనాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కళాశాల వార్షిక నివేదికను అందించారు. అనంతరం కళాశాలలో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన ఐదుగురు విద్యార్థులకు శ్రీధర్ రూ.25 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, ఎ.రామారావు, కో-ఆర్డినేటర్ లుక్ పాల్, దుర్యోధనరావు, త్రినాధరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ శ్రీధర్